క్లుప్తంగా

మల్లేశ్వర స్వామికి పంచామృత అభిషేకాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామివారికి విశేష పూజలు జరిగాయి. మల్లేశ్వర స్వామివారికి భక్తులు పంచామృత అభిషేకాలు జరిపించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చనను ఆలయ అర్చకులు నిర్వహించగా, ఆలయ ఈవో కెఎస్.రామరావు దంపతులు లింగార్చనలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి విశేషంగా అలంకరించారు. సాయంత్రం మల్లేశ్వర స్వామివారికి పంచహారతుల సేవ, సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవలను నిర్వహించారు. ఆయా సేవల్లో ఆలయ అధికారులు, సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ దిశగా ఏపీటీడీసీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ దిశగా ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీటీడీసీ) స్పీడ్ పెంచిందని సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ పేర్కొన్నారు. విజయవాడలో ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ నిర్వహిస్తున్న సెమినార్‌లో ఆయన శనివారం పాల్గొన్నారు. వివిధ రంగాల ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందిస్తూ ఏ విధమైన సమస్యలకైనా సత్వర పరిష్కారం లభించేలా ముఖ్యమంత్రి, టూరిజం శాఖ మంత్రితో మాట్లాడతానన్నారు. ఈ సందర్భంగా ఆయన సెమినార్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం నిర్వాహకులు బాలాజీని సత్కరించారు. ఏపీటీడీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

సైన్స్‌పై విద్యార్థులు పట్టు సాధించాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సైన్స్ సబ్జెక్టుపై పట్టు సాధించాలని జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్ అన్నారు. నగరంలోని వివిధ పాఠశాల్లో ఉన్న సైన్స్ స్టేమ్ ల్యాబ్‌లను జిల్లా సైన్స్ అధికారి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల్లో ఉన్న సైన్స్ ల్యాబ్స్, స్టేమ్ ల్యాబ్స్ ఎలా పని చేస్తాయో, వాటి ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తమ తమ పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రయోగాలను నిర్వహించి వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. అదేవిధంగా రానున్న పదో తరగతి పరీక్షల్లోనూ విద్యార్థులు సైన్స్ అంశాల్లో మరిన్ని మార్కులను సాధించే దిశగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆన్‌లైన్ మోసంపై స్థానిక వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే వన్‌టౌన్‌లోని పాలివారివీధిలో ఉంటున్న ఉర్లాన నాగరాజు సివిల్ కాంట్రాక్టర్‌గా వివిధ పనులు చేస్తుంటాడు. అతని వద్ద 20 మంది వర్కర్లు పని చేస్తున్నారు. అయితే నాగరాజుకు వివాహం కాపోవడంతో అతని వద్ద పని చేసే వర్కర్లలోని పరమేశ్వర భద్ర తమ బంధువుల్లో సంబంధం చూస్తానని చెప్పాడు. ఆ క్రమంలో పరమేశ్వర భద్ర ఒక ఇన్‌స్టాగామ్ ఐడీని నాగరాజుకు ఇచ్చి మాట్లాడమని సూచించాడు. నాగరాజు ఆ ఐడీ ఉన్న మహిళతో వాట్సాప్‌లోనూ మాట్లాడటం ప్రారంభించాడు. దాంతో ఆ మహిళ తన తండ్రికి ఆరోగ్యం బాగాలేదని ఇతరేతర కారణాలతో పలుమార్లు డబ్బులు అడగడంతో నాగరాజు పంపించాడు. ఇలా మొత్తం రూ.11 లక్షల మేర ఆమె బ్యాంక్ ఖాతాకు, ఫోన్‌పేకు పంపించాడు. అయితే ఈ నగదు విషయంపై నాగరాజు, పరమేశ్వర భద్రను అడగగా అతని నుంచి సరైన సమాధానం రాలేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన నాగరాజు శనివారం వన్‌టౌన్ పోలీసులకు ఆమెపై ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శివమోహినీదేవిగా భ్రమరాంబ అమ్మవారు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం(పాత శివాలయం)లో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ అమ్మవారు శనివారం శివమోహినీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకొని కార్తిక నక్త దీక్ష మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను చేపట్టారు. శివమోహినిదేవిగా దర్శనమిచ్చిన శ్రీ భ్రమరాంబ అమ్మవారికి త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామార్చన కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు.

శిథిలమైన భవనాలతో బెంబేలు

- లేబర్ కాలనీలో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఆరు బిల్డింగ్‌లు
- చెట్ల వేళ్లు ఇళ్లలోనికి చొచ్చుకొచ్చి.. శ్లాబ్ పెచ్చులు రాలిన వైనం
- ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి
- పట్టించుకోని నగరపాలక సంస్థ, కార్మిక శాఖ అధికారులు
- ఆందోళనలో నివాసితులు



న్యూ లేబర్‌కాలనీలోని ఆరు బిల్డింగ్‌లు



గోడలో నుంచి మొలిచిన చెట్టు



భవనంపై పడిపోయిన పిట్ట గోడ

భవానీపురం(విజయవాడపశ్చిమ): నాలుగు దశాబ్దాల క్రితం కార్మిక శాఖ నిర్మించిన ఆరు బిల్డింగ్‌లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆయా బిల్డింగ్‌లపైన, గోడల మధ్య చెట్లు పెరిగి వాటి వేళ్లు విస్తరించి ఇళ్లల్లోకి చొచ్చుకొస్తున్నాయి. అదే క్రమంలో శ్లాబ్‌ల పెచ్చులు రాలి గదుల్లో పడుతున్నాయి. బిల్డింగ్‌పైన ఉన్న పిట్టగోడలు కూలిపోతున్నాయి. ఆ శిథిల భవనాల్లో నివసిస్తున్న వారు ఏం జరుగుతుందోనని బిక్కు బిక్కుమంటూ బతుకుతున్నారు. ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితుల్లో ఆరు బిల్డింగ్‌ల వాసులు ఆందోళన చెందుతున్నారు. ఒక వైపు నామమాత్రపు అద్దె వసూలు చేస్తున్న కార్మిక శాఖ, మరో వైపు పన్నులు వసూలు చేస్తున్న నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోక పోవడంతో వారి ప్రాణాలు గాలిలో దీపాల్లా మిణుకు మిణుకుమంటూ ఉన్నాయి. అప్పటి స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆరు బిల్డింగ్‌ల నివాసితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు విశేష కృషి చేసినా అనివార్య కారణాల వలన అది సాధ్యపడలేదు.

కార్మికుల ప్రయోజనార్థం ఆరు బిల్డింగ్‌లు

విద్యాధరపురం లేబర్‌కాలనీలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పని చేసే కార్మికుల కోసం 1982లో న్యూ లేబర్‌కాలనీ(సెమీ ఇండిపెండెంట్ హౌసింగ్ స్కీమ్) పేరుతో నాలుగు దశాబ్దాల క్రితం కార్మిక శాఖ ఆరు బిల్డింగ్‌లు నిర్మించింది. మొత్తం ఆరు బ్లాకు (బిల్డింగ్)ల్లో ఒక్కో బ్లాక్‌లో ఎనిమిది చొప్పున 48 ఫ్లాట్లు ఉన్నాయి. వాటిల్లో ఎనిమిది ఫ్లాట్లలో మాత్రమే ఒరిజినల్ హోల్డర్స్ ఉంటుండగా, 32 ఫ్లాట్లలో ఒరిజినల్ హోల్డర్స్ వారసులు కొందరు, కొనుగోలు(చేతులు మారినవి) చేసిన వారు మరి కొందరు, అద్దెకు ఉంటున్నావారు ఇంకొందరు ఉన్నారు. మరో ఎనిమిది ఖాళీగా ఉండగా కొందరు ఆక్రమించుకుని వినియోగించుకుంటున్నారు. కార్మిక శాఖ బిల్డింగ్‌లు నిర్మించిన సమయం(1982)లో ఒక్కో ఫ్లాట్‌కు నామమాత్రపు అద్దె కింద రూ.21.50ల వసూలు చేసేది. ఇప్పటికి కూడా నివాసితులు అదే అద్దె చెల్లిస్తున్నారు. అది కాకుండా నగరపాలక సంస్థ విధించిన పన్ను షరా మామూలే. ఆ విధంగా ఆరు బిల్డింగ్‌లలో మొత్తం 40 మంది మాత్రమే పన్నులు, అద్దె చెల్లిస్తున్నారు.

ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?

శిథిలమైపోయిన ఆరు బిల్డింగ్‌ల దుస్థితి లేబర్ డిపార్ట్‌మెంట్, మున్సిపల్ కార్పొరేషన్ దృష్టిలో కూడా ఉంది. అయినా ఎవరికీ వారు నిమ్మకునీరెత్తినట్లు చోద్యం చూస్తున్నారు తప్ప పరిష్కార మార్గం గురించి ఆలోచన చేస్తున్న దాఖలాలు లేవు. అధికారుల తీరుపై కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సంభవించిన బుడమేరు వరదకు ఆరు బిల్డింగ్‌ల ప్రాంతం ఏడు అడుగుల మేర వరద నీటిలో మునిగిపోయింది. గ్రౌండ్ ఫ్లోర్‌లో నివసిస్తున్నవారు ముంపునకు గురై తీవ్రంగా నష్టపోయారు. ఆటువంటి వరద మరోసారి వస్తే శిథిల భవనాలు కుప్పకూలిపోతాయని నివాసితులు వాపోతున్నారు. ఇటువంటి దుస్థితిలో ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి..



40 ఏళ్లకు పైగా ఆరు బిల్డింగ్‌లో నివసిస్తున్నాం. శిథిలమైపోయిన భవనంలో ఉంటున్నామే కానీ ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న భయం వెంటాడుతోంది. పనులపై బయటకు వెళ్లినా పెచ్చులూడి పడిపోయే ఇల్లు, కుటుంబసభ్యుల గురించే ఆలోచన. వెలంపల్లి శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తమ బాధలు చూడలేక పరిష్కారం కోసం కృషి చేసినా కొందరు అడ్డుపడటంతో ఆగిపోయింది. శిథిల భవనంలో నుంచి బయటపడేందుకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– వల్లం రవి కుమార్, కాలనీవాసి

న్యాయం చేయాలి



ఏళ్ల తరబడి కాలనీలోని ఆరు బిల్డింగ్‌ల్లో ఉంటున్నాం. తాగునీటి సౌకర్యం లేని రోజుల నుంచి నేటి వరకు అలాగే కాలం వెళ్లదీస్తున్నాం. ఒక పక్క ముంపు బాధ మరో వైపు బిల్డింగ్ ఎప్పుడు కుప్పకూలిపోతుందోనన్న భయం నిద్ర కూడా లేకుండా చేస్తోంది. మా నాన్న సుబ్బారావు జీవించి ఉండగా ఆరు బిల్డింగ్‌ల దుస్థితి గురించి సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరిగి వినతి పత్రాలు ఇచ్చేవారు. ఉన్నతాధికారులను సైతం కలిసి విజ్ఞప్తులు చేశారు. ఇంత వరకు అతీగతీ లేదు. పాలకులు ఇప్పటికైనా స్పందించి న్యాయం చేయాలి.

– చాగంటి సుధాకర్, కాలనీవాసి

ప్రయాణికులకు పరిశుభ్రమైన బెడ్‌షీట్లు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వేబోర్డు నిర్దేశించిన పరిశుభ్రత ప్రోటోకాల్‌ను ఖచ్చితంగా పాటిస్తూ క్రమం తప్పకుండా రైలు ప్రయాణికులకు అత్యాధునిక యంత్రాలను ఉపయోగించి పరిశుభ్రమైన బెడ్‌షీట్స్, బ్లాంకెట్స్ అందజేయడంలో విజయవాడ డివిజన్ నిబద్ధతో పనిచేస్తోందని ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడ డివిజన్‌లోని మెకనైజ్డ్ బూట్ లాండ్రీలో పలుదశల్లో లెనిన్, ఉన్ని దుప్పట్లు పరిశుభ్రతపై ఏడీఆర్ఎం మీడియా ఎదుట డెమో నిర్వహించారు. అందులో తడిసిన దుప్పట్లు, బెడ్‌షీట్స్, దిండు కవర్లు, కర్టెన్స్, బ్లాంకెట్స్‌ను దశలవారీగా శుభ్రపరిచే ప్రక్రియను వివరించారు. డివిజన్‌లోని విజయవాడ, కాకినాడలోని మెకనైజ్డ్ బూట్ లాండ్రీల ద్వారా అవసరమైన మోతాదులో రసాయనాలను ఉపయోగించి నెలకు 6.5 లక్షలకు పైగా బెడ్‌షీట్స్, 10 వేల ఉన్ని దుప్పట్ల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటిని విజయవాడ మీదుగా నడిచే పది రైళ్లకు సరఫరా చేస్తున్నామని, పరిశుభ్రత ప్రోటోకాల్స్ ప్రమాణాలను ఖచ్చితంగా పాటించడం ఫలితంగానే ప్రయాణికుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేవని వివరించారు. కార్యక్రమంలో కోచింగ్ డిపో ఆఫీసర్ ఎం.హరిశివ ప్రసాద్, జీఆర్‌ఓ నుస్రత్ ముంద్రుప్కర్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా శ్రీమతి అమరావతి

గుణదల(విజయవాడతూర్పు): మానసిక పరిపక్వతే మహిళలకు నిజమైన సౌందర్యమని ప్రముఖ మహిళా వ్యాపారవేత్త చాందినీ అన్నారు. తేజాస్ ఎలైట్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో శ్రీమతి అమరావతి ఆడిషన్స్ కార్యక్రమం నోవోటెల్ హోటల్‌లో శనివారం జరిగింది. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా హాజరైన ఆమె మాట్లాడుతూ ఆత్మస్థైర్యం, ప్రతిభ, బాధ్యతలు కలిగి ఉన్న స్త్రీలు నిజమైన సౌందర్యవంతులని తెలిపారు. ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను కనబరుస్తున్నారని పేర్కొన్నారు. గృహిణిగా, తల్లిగా, కుటుంబ బాధ్యతలు నిర్వహించడంలో నిబద్ధతగా వ్యవహరిస్తున్నారని వివరించారు. తేజాస్ ఎలైట్ ఈవెంట్స్ అధినేత ప్రదీప్ చౌదరి మాట్లాడుతూ మహిళలను చైతన్య వంతులుగా తీర్చిదిద్దేందుకు శ్రీమతి అమరావతి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత తొమ్మిది వసంతాలుగా ఈ కార్యక్రమం విజయవంతంగా జరుగుతోందన్నారు. ఈ ఆడిషన్స్‌లో విజేతలను ఎంపిక చేసి డిసెంబర్ 14న జరిగే కార్యక్రమంలో బహుమతులు అందిస్తామన్నారు. అనంతరం వివిధ సంప్రదాయ వస్త్రాలలో మహిళలు ర్యాంప్ వాకింగ్ నిర్వహించారు. పట్టు చీరలు ధరించి తెలుగు తనాన్ని చాటి చెప్పారు. మల్లికా చౌదరి, ప్రముఖ గాయని మంజూష పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్ల పంపిణీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీ శ తెలిపారు. స్థానిక 41వ డివిజన్ పరిధిలో శనివారం చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని పంపిణీ చేశారు. పింఛన్‌దార్లతో కలెక్టర్ మాట్లాడి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్, నగరపాలక సంస్థ ఏసీ హెలెన్, యూసీడీ పీఓ నారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పింఛన్‌దారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీ శ

హెచ్ఐవీ పిల్లల్లో మనోధైర్యాన్ని కల్పించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): పిల్లల్లో ఎయిడ్స్‌పై అవగాహనతో పాటు వారిలో మనోధైర్యాన్ని కల్పించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ(ఏపీ శాక్స్) ప్రాజెక్ట్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సరస్వతి పేర్కొన్నారు. హెచ్ఐవీ పిల్లలకు అండగా నిలబడేందుకు శనివారం భవానీపురంలోని హరిత బెరంపార్క్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కమ్యూనిటీ బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారుల్లో మనోధైర్యం పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా 60 మంది చిన్న పిల్లలతో ప్రముఖులు కలిసి ముచ్చటించడం వారిలో నూతన ఉత్సాహం వెల్లివిరిసింది. వైఆర్జీ కేర్ సంస్థ, ఏపీ శాక్స్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్లు డాక్టర్ టి.మంజుల, డాక్టర్ కామేశ్వరప్రసాద్, డాక్టర్ భాగ్యలక్ష్మి, డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చక్రవర్తి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జే ఉషారాణి, కో ఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.పద్మావతి, తంబు రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

టాయిలెట్ల నిర్వహణపై చర్యలు తీసుకుంటాం

సాక్షి ఎఫెక్ట్

వించిపేట(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలోని చిట్టినగర్, ఫ్రైజర్‌పేట, ఎర్రకట్టరోడ్డు తదితర ప్రాంతాల్లో నిర్వహణ లేక దుర్గంధభరితంగా మారిన టాయిలెట్, మూత్రశాలలపై శనివారం సాక్షిలో ప్రచురితమైన 'కానరాని స్వచ్ఛ సర్వేక్షణ్' అనే కథనంపై అధికారులు స్పందించారు. నగరపాలకసంస్థ డీఈ కరుణాకర్ శానిటరీ సూపర్‌వైజర్ ఓబులేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణలతో ఆయా ప్రాంతాల్లోని టాయిలెట్, మూత్రశాలలను పరిశీలించారు. పాఠశాలల వద్ద ఉన్న మూత్రశాలలతో పాటు ఫ్రైజర్‌పేటలోని టాయిలెట్‌లను పరిశీలించి శుభ్రపర్చి బ్లీచింగ్ చల్లించారు. ప్రతి టాయిలెట్‌లు, మూత్రశాలలను పర్యవేక్షిస్తూ పరిశుభ్రత చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే టాయిలెట్‌ల నిర్వహణకు సిబ్బందిని కేటాయించి వాటి నిర్వహణను సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోనున్నట్లు డీఈ తెలిపారు.



ఫ్రైజర్‌పేటలో అధికారులకు సూచనలిస్తున్న డీఈ కరుణాకర్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): రామరాజ్యనగర్ సెక్షన్ 33/11 కేవీ పున్నమి సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ నేతాజ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు టంటంవారి వీధి, అండమాని బ్రహ్మయ్య వీధి, గురుకృప రోడ్, సిమెంట్ రోడ్, లొల్లావారి వీధి, టీవీ కృష్ణారావు వీధి, అరవింద వీధి, కేసీ పబ్లిక్ స్కూల్ రోడ్, భారత్ గ్యాస్ కంపెనీ గోడౌన్ ఏరియా తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

దేశ ప్రగతికి అండగా నిలవాలి



మాట్లాడుతున్న కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య శోభన్‌బాబు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశ ప్రగతికి విద్యార్థులు అండగా నిలవాలని కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కె.శోభన్‌బాబు అన్నారు. కేబీఎన్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఆ కళాశాల ప్రాంగణంలో శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య శోభన్‌బాబు డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలను సవాళ్లను ధైర్యంగా అంగీకరించి వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు సాగాలన్నారు. తమ విశ్వవిద్యాలయం పరిధిలోని అత్యుత్తమ కళాశాలలో కేబీఎన్ ఒకటిగా నిలిచిందని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం డిగ్రీలు సాధించటంతోనే విద్యాభ్యాసం పూర్తి కాదని చదివిన చదువులోని జ్ఞానాన్ని తెలుసుకొని దాన్ని ఆచరణలోకి తీసుకువచ్చినప్పుడే నేర్చుకున్న విద్యకు సార్థకత ఏర్పడుతుందన్నారు. 17కు పైగా డిగ్రీ కోర్సులతో తమ కళాశాల కొనసాగుతుందన్నారు. అనంతరం డిగ్రీ పూర్తి చేసిన 750 మంది విద్యార్థులకు ఆచార్య శోభన్‌బాబు పట్టాలు ప్రదానం చేశారు. సభలో కళాశాల సెక్రటరీ డాక్టర్ టి శ్రీనివాసు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వి.సురేష్ పాల్గొన్నారు.

నూతన సాంకేతికతపై పట్టు సాధించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నూతన సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు పట్టు సాధించాలని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ అన్నారు. ఆ కళాశాల ఎంసీఏ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంకేతిక క్లబ్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శరవణకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవటం, సృజనాత్మక ఆలోచనలకు శ్రీకారం చుట్టడం వంటి లక్ష్యాలతో ఈ క్లబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. వివిధ ప్రాజెక్ట్‌ల ద్వారా విద్యార్థులు తమ మేథస్సుకు పదును పెట్టి కొత్త సాంకేతిక అంశాలపై మరింత పట్టు సాధించాలని సూచించారు. అలాగే ఆయా రంగాల్లో వచ్చే సమస్యల పరిష్కారానికి అవసరమైన అంశాలపై సైతం అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ కె.సురేష్‌బాబు, డాక్టర్ ఏ పతంజలిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



సాంకేతిక క్లబ్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ శరవణకుమార్

• హోరాహోరీగా ఆటల పోటీలు

విజయవాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఎన్టీఆర్ జిల్లా స్థాయి పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్–2024 పోటీలు హోరాహోరాగా సాగాయి. చివరిరోజు పోటీల్లో భాగంగా టగ్ ఆఫ్ వార్, అథ్లెటిక్స్, జావెలిన్‌త్రో, హామర్‌త్రో, త్రోబాల్ పోటీల్లో క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









